



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం,
నవంబరు 18, 2025

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-


# సౌదీలో ఘోరం



**ఉమ్రా బృందం ప్రయాణిస్తున్న బస్సుకు ఆయిల్ ట్యాంకర్ ఢీ.. 45మంది మృతి**

హైదరాబాద్ నుంచి వెళ్లినవారికి ఘోరం.. మంటల్లో ఒకరే బ్రతికి బయటపడటం

ఒకే కుటుంబంలో అనేక మంది ప్రాణాలు కోల్పోవడం.. మృతదేహాలు జెడ్డా ఆసుపత్రులకు తరలింపు

భారత రాయబారి సహాయక చర్యలు.. తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక సాయం ప్రకటింపు

సౌదీ అరేబియాలో మక్కా-మదీనా హైవేపై భారతీయులకు సంబంధించిన ఒక భయానక ప్రమాదం చోటు చేసుకుని దేశవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. హైదరాబాద్ నుంచి ఉమ్రా కోసం బయలుదేరిన గుంపు ప్రయాణిస్తున్న కోచ్ వాహనాన్ని వేగంగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో భారీగా అగ్ని చెలరేగి, అందులో ఉన్న దాదాపు మొత్తం యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం తెల్లవారుజామున సంభవించడమే కాక, తీవ్రంగా దహనం కావడంతో వారిని రక్షించే అవకాశం లేకుండాపోయింది. బస్సు రహదారి పక్కన ఆగి ఉండగా, ఇంధనాన్ని మోసే భారీ వాహనం అదుపు కోల్పోయి నేరుగా దానిని ఢీకొట్టిందని స్థానికంగా తెలిసిన వివరాలు చెబుతున్నాయి. ఢీకొనడం జరిగిన వెంటనే పేలుడు మోగి మంటలు అత్యంత వేగంగా వ్యాప్తి



## షేక్ హసీనాకు మరణ-శిక్ష

తీర్పు వెలువరించిన బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్

మాజీ హెూం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌కూ మరణశిక్ష

మాజీ ఐజీ చౌదరి అబ్దుల్లా అల్‌మమూన్‌కు ఐదేళ్ల శిక్ష

తీర్పును రాజకీయకుట్రగా అభివర్ణించిన పదవీచ్యుత ప్రధాని

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ విమోచన పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర్యసమరయోధుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కేటాయింపుతో మొదలైన విద్యార్థుల ఉద్యమం చివరకు పదవీచ్యుత మహిళా ప్రధాని షేక్ హసీనాకు అంతర్జాతీయ నేరాల ట్రిబ్యూనల్ మరణశిక్ష విధింపునకు దారితీసింది. జూలై 15న విద్యార్థుల సారథ్యంలో ఉవ్వెత్తున ఎగసిన ఆందోళనలను ఉక్కుపాదంతో అణచివేసి 1,400 మంది మరణాలకు హసీనా కారణమయ్యారంటూ దాఖలైన కేసులో ఆమెకు మరణశిక్ష విధిస్తూ

(మిగతా 2వ పేజీలో)

## ఆశలు నెరవేర్చే పార్టీలనే నమ్ముతారు ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్య






## పదోసారి సీఎంగా

**రికార్డ్ నెలకొల్పనున్న నితీశ్ కుమార్**

**19న అధికార పక్ష నేతగాఎన్నిక.. 20న ముఖ్యమంత్రిగా ప్రమాణం!**

పట్నా: అన్ని వర్గాల ఓటర్ల ఆశీస్సులు పొందిన బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రికార్డుస్థాయిలో పదోసారి సీఎంగా ప్రమాణంచేయబోతున్నారు. ఈ ప్రక్రియకు సోమవారం తొలి అడుగు పడింది. కొత్త ప్రభుత్వ ఏర్పాటులోభాగంగా పట్నాలో రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌ను నితీశ్ కలిసి తన రాజీనామా లేఖను అందించారు. బుధవారం మళ్లీ కలిసి తనకు మద్దతుగా నిలిచిన ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యేల జాబితాను అందజేయనున్నారు. నవంబర్ 19వ తేదీన నితీశ్‌ను అధికార పక్ష నేతగా ఎన్నుకోబోతున్నట్లు జనతాదళ్(యునైటెడ్) పార్టీ వర్గాలు సోమవారం వెల్లడించాయి. పట్నాలో నవంబర్ 20వ తేదీన గాంధీమైదాన్‌లో జరిగిన భారీ ప్రమాణస్వీకారోత్సవంలో నితీశ్ కుమార్ పదోసారి సీఎంగా ప్రమాణంచేయబోతున్నట్లు పార్టీలోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అదే వేదికపై మరి కొందమంది నేతలు సైతం కేబినెట్ మంత్రులుగా ప్రమాణంచేయనున్నారు. ప్రధాని మోదీ, పలువురు ఎన్‌డీఏ కూటమి కీలక నేతలు, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు ప్రమాణస్వీకార కార్య క్రమానికి విచ్చేయ నున్నారు. కేబినెట్ మంత్రులుగా తమకు అవకాశం ఇవ్వాలని బీజేపీ, జేడీయూసహా ఎన్‌డీఏలోని కీలక భాగస్వామ్య పార్టీల ముఖ్యనేతల నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. లాబీయింగ్ బెడద హఠాత్తుగా పెరిగిందని జేడీయూ వర్గాలు తెలిపాయి. తొలిరోజు నితీశ్‌తోపాటు ఐదారు మంది నేతలు మంత్రులుగా ప్రమాణంచేసే అవకాశముంది. కొత్త కేబినెట్‌లో

(మిగతా 2వ పేజీలో)

## స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే ధిక్కరణ చర్యలు తప్పవని సుప్రీంకోర్టు హెచ్చరిక

స్పీకర్ ఆలస్యంపై సుప్రీంకోర్టు అసహనం

అనర్హత పిటిషన్లపై వెంటనే నిర్ణయం తీసుకోమని హెచ్చరిక

ఆదేశాలు పాటించకపోతే ధిక్కరణ తప్పదని సీజేఐ వ్యాఖ్య

కొత్త సంవత్సరం ఎక్కడ జరుపుకుంటారో
స్పీకర్ చూసుకోవాలన్న సీజేఐ హెచ్చరిక

జాప్యం ఉద్దేశపూర్వకమేమీ కాదని న్యాయవాదుల వివరణ

నాలుగు వారాల్లో సమాధానాలు ఇవ్వాలని కోర్టు ఆదేశం

పురోగతి లేకుంటే తీవ్ర చర్యలు ఉంటాయని కోర్టు సూచన



న్యూఢిల్లీ: పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత వేటు విషయంలో తాత్సారం చేస్తున్నారంటూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారంటూ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం మండిపడింది. 'అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకుంటారా? లేక కోర్టు ధిక్కరణ చర్యలు ఎదుర్కొంటారా? అనేది స్పీకరే తేల్చుకోవాలి. వచ్చే వారంలోగా అనర్హత పిటిషన్లపై

(మిగతా 2వ పేజీలో)


## స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే ధిక్కరణ చర్యలు తప్పవని సుప్రీంకోర్టు హెచ్చరిక

::: స్పీకర్ ఆలస్యంపై సుప్రీంకోర్టు అసహనం

అనర్హత పిటిషన్లపై వెంటనే నిర్ణయం తీసుకోమని హెచ్చరిక

ఆదేశాలు పాటించకపోతే ధిక్కరణ తప్పదని సీజేఐ వ్యాఖ్య




## ఐబొమ్మ నిలిపివేతతో పైరసీ, బెట్టింగ్ ముఠాలకు చెక్

ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టుతో గుట్టు రట్టయిన అక్రమజాలం



# సౌదీలో ఘోరం



గుర్తించేందుకు అక్కడి వైద్య బృందాలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. మృతదేహాలను జెడ్డాలోని వివిధ వైద్య కేంద్రాలకు తరలించినట్లు అక్కడి సమాచారం. వివిధ సంస్థల ద్వారా 54 మంది హైదరాబాద్ నుంచి తొమ్మిదో తేదీన బయలుదేరారు. వారిలో కొందరు మక్కాలోనే ఆగిపోగా, మరో నలుగురు వేరే వాహనంలో మదీనా చేరుకున్నారు. 46 మంది బస్సులో ప్రయాణిస్తుండగా ఈ విషాదం జరిగింది. మదీనా చేరడానికి కొద్దిదూరంలోనే ఈ సంఘటన నమోదైంది. భారత ప్రభుత్వం ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని జెడ్డా, రియాద్ కార్యాలయాల ద్వారా సహాయక చర్యలు ప్రారంభించింది. బాధితుల కుటుంబాలకు సమాచారం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్‌లు ప్రారంభించారు. అధికారులు ఆసుపత్రులు, ఘటనా స్థలాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

### దేశ నేతల సానుభూతి

ఈ ప్రమాదంపై ప్రధాన నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాల పరిస్థితిని అర్థం చేసుకుంటున్నామని, అవసరమైన సహాయం అందిస్తామని ప్రకటించారు. విదేశాంగ, మైనారిటీ శాఖలు స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం ప్రకటించింది. సమన్వయం కోసం ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని సౌదీకి పంపేందుకు చర్యలు తీసుకుంది. ఢిల్లీలోని రాష్ట్ర భవన్, హైదరాబాద్‌లోని సచివాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి సంబంధిత వివరాలు అందిస్తున్నారు.

### అంత్యక్రియలపై పరిశీలన

స్థానిక సంప్రదాయాల మేరకు అక్కడే ఖననం చేసే అవకాశాలను రాయబారి కార్యాలయాలు పరిశీలిస్తున్నాయి. కుటుంబ సభ్యుల్లో ఇద్దరిని అక్కడికి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లను కూడా చూడుతున్నారు.

### హజ్ మార్గాల్లో తరచూ ప్రమాదాలు

సౌదీ హైవేల్లో హజ్, ఉమ్రా కాలాల్లో వాహన రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల ఇలాంటి ఘటనలు పునరావృతమవుతుంటాయని గత చరిత్ర చూపుతోంది. కొద్ది సంవత్సరాల కింద కూడా ఇలాంటి బస్సు ప్రమాదాల్లో అనేక ప్రాణనష్టాలు నమోదయ్యాయి.

# స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే ధిక్కరణ చర్యలు తప్పవని సుప్రీంకోర్టు హెచ్చరిక

నిర్ణయం తీసుకోండి. లేదంటే కోర్టు ధిక్కరణ చర్యలు ఎదుర్కోవ డానికి సిద్ధంగా ఉండండి'అనిఅల్టిమేటం జారీ చేసింది. ఈ వ్యవహారంలో 4 వారా ల్లోగా సమాధానం ఇవ్వాలని స్పీకర్ కార్యాల యానికి నోటీసులు జారీ చేసింది.

### కచ్చితంగా కోర్టు ధిక్కరణే.. రక్షణ ఉండదు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖ లు చేసిన పిటిషన్‌తో పాటు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు దాఖలు చేసిన కోర్టు ధిక్క రణ పిటిషన్‌ను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. గతంలో జూలై 31న, మూడు నెలల్లోగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పీకర్‌ను ఆదేశించింది. అయితే ఆ గడువు ముగిసినా ఎటువంటి నిర్ణయం వెలువడలేదు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. 'అనర్హత పిటిషన్లను విచారించేటప్పుడు స్పీకర్ ఒక 'ట్రిబ్యునల్'గా వ్యవహరిస్తారు. ఆ సమయంలో ఆయనకు ఎటువంటి రాజ్యాంగపరమైన మినహాయింపులు వర్తించవు. కోర్టు ఆదేశాలను పాటించకపోవడం స్పష్టంగా తీవ్రమైన ధిక్కరణ కిందకే వస్తుంది'అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

### న్యూ ఇయర్ ఎక్కడ జరుపుకుంటారు?

విచారణ సందర్భంగా సీజేఐ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. స్పీకర్ తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ.. 'వచ్చే కొత్త సంవత్సరాన్ని ఎక్కడ జరుపుకోవాలనుకుంటున్నారో ఆయనే (స్పీకర్) నిర్ణయించుకోవాలి'అని హెచ్చరించారు. 'తక్షణం దీనిని తేల్చండి.. లేదా మేమే ధిక్కరణ చర్యలు మొదలుపెడతాం'అని సీజేఐ స్పష్టం చేశారు. కాగా నాలుగు వారాల్లోగా విచారణ పూర్తి చేస్తామని స్పీకర్ తరఫు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, అభిషేక్ మను సింఘ్వీలు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అంతేగాక తాము ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడం లేదని, హైకోర్టు, సుప్రీంకోర్టు మధ్య పిటిషనర్ తిరుగుతుండటం వల్ల ఏర్పడిన న్యాయపరమైన సందిగ్ధత వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వారు సమర్థించుకునే ప్రయత్నం చేశారు. అన్ని పిటిషన్లూ ఒకే దశలో లేవని, నాలుగు పిటిషన్ల విచారణ పూర్తయిందని,



మూడు పిటిషన్లకు సంబంధించి సాక్ష్యాధారాల నమోదు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. రెండు పిటిషన్లను ఇంకా పరిశీలించలేదని అవి విచారణ దశలో ఉన్నాయని స్పీకర్ తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వివరించారు.

### నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలి..

ఈ కేసులో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం, సమాధానం చెప్పడానికి నాలుగు వారాల సమయం ఇచ్చింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ప్రస్తుతానికి స్పీకర్ వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చినప్పటికీ, తదుపరి విచారణ నాటికి కచ్చితమైన పురోగతి ఉండాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ధర్మాసనం సంకేతాలు ఇచ్చింది.

# ఐబొమ్మ నిలిపివేతతో పైరసీ, బెట్టింగ్ ముఠాలకు చెక్

## ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టుతో గుట్టు రట్టయిన అక్రమ జాలం

**పైరసీ వేదికల ద్వారా బెట్టింగ్ యాప్‌ల ప్రచారం, వినియోగదారుల మోసం బయటపడింది**

**50 లక్షల యూజర్ల డేటా దుర్వినియోగ అవకాశంపై పోలీసులు హెచ్చరిక**

**ఐబొమ్మ-బప్పం టీవీతో పాటు 65 వెబ్‌సైట్లను పూర్తిగా బ్లాక్ చేసిన సైబర్ యూనిట్**

**కొత్తగా విడుదలయ్యే సినిమాలు గంటల్లో ఆన్‌లైన్‌లో పెట్టిన టెక్నికల్ నెట్వర్క్ ధ్వంసం**

హైదరాబాద్ సిటీ : చలనచిత్ర రంగానికే కాకుండా సమాజానికీ గణనీయమైన నష్టాన్ని కలిగించిన ఐబొమ్మ వెబ్‌డొమైన్ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసిన విషయాన్ని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. సరికొత్త సినిమాలను అక్రమంగా అప్‌లోడ్ చేయడంతో పాటు బెట్టింగ్ అప్లికేషన్‌ల ప్రాచుర్యానికి వేదికగా ఈ సైటును ఉపయోగించినట్లు తెలిపారు. సినీ ప్రముఖులు చిరంజీవి, నాగార్జున, దర్శకుడు రాజమౌళి, నిర్మాతలు దిల్‌రాజు, సురేష్ బాబు పాల్గొన్న సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ఇమ్మడి రవిపై సమాచార సాంకేతిక చట్టం, కాపీరైట్ నిబంధనలు, అలాగే బీఎన్ఎసి విభాగాల కింద నాలుగు కేసులు నమోదు చేశారు. రవికి వేలాది పైరేటెడ్ చిత్రాలు ఉన్నాయని, పాత క్లాసిక్స్ నుంచి తాజా విడుదలల వరకు అన్ని రకాల సినిమాలను దొంగసర్వర్లలో దాచినట్లు చెప్పారు. ఈ చర్యల ద్వారా అతడు సుమారు 20 కోట్లు సంపాదించాడని, అందులో 3 కోట్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అక్రమ బెట్టింగ్ వేదికలైన 1విన్, 1ఎక్స్‌బెట్ వంటి ప్లాట్‌ఫారమ్‌లకు ఐబొమ్మ ద్వారా లక్షలాది వినియోగదారులను మళ్లించారని, వారి వ్యక్తిగత వివరాలు సైబర్ దుండగుల చేతిలో పడే ప్రమాదం ఉన్నట్లు తెలిపారు. మొత్తం 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల సమాచారం ఈ నెట్వర్క్ వద్ద ఉండటం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ఈ డేటా ఎవరికి వెళ్లిందో తెలుసుకునేందుకు లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. తాజా టెక్నాలజీ వాడకం ద్వారా ఉదయం థియేటర్లలో విడుదలైన సినిమాను అదే రోజు సాయంత్రం ఐబొమ్మలో పెడుతున్నాడని వివరించారు. రవితోపాటు దుద్దెల శివాజీ,



సురస్ల ప్రశాంత్‌లను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పైరసీ సినిమా వెబ్‌సైట్లైన ఐబొమ్మ, బప్పం టీవీ చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్నాయని, థియేటర్ కెమెరాలు, ఓటిటి స్క్రీన్ రికార్డింగ్ ద్వారా వేలాది వీడియోలను అప్‌లోడ్ చేశారని తెలిపారు. అక్రమ కంటెంట్ ఉన్న ఈ రెండు పోర్టల్స్‌ను పూర్తిగా నిలిపివేసినట్లు ప్రకటించారు. ఈ చర్యలపై సోషల్ మీడియాలో వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### 'దమ్ముంటే పట్టుకోండి అన్నాడు... ఇప్పుడు ఫలితం చూశాడు' %-% సజ్జనార్

రవికి 5 కోట్ల మంది యూజర్ల డేటాబేస్ ఉందని, బ్లాకింగ్ చేస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని అతడు విదేశాల నుంచి బెదిరించాడని సజ్జనార్ తెలిపారు. చివరకు అతడిని పట్టుకునేందుకు ఉపయోగించిన పోలీస్ నెట్‌వర్క్ మార్గాలను కూడా వివరించారు. అతని వద్ద లభించిన మొబైల్ పరికరాలు, ల్యాప్‌టాపులు, బ్యాంక్ పత్రాలు, డెబిట్%-%క్రెడిట్ కార్డ్‌లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.

# ఆశలు నెరవేర్చే పార్టీలనే నమ్ముతారు: ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: సదుద్దేశంతో ముందడుగు వేసి, తమ ఆశయాలను నెరవేర్చే రాజకీయ పార్టీలనే ప్రజలు విశ్వసిస్తారని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. సోమవారం ఢిల్లీలో ఆరో రామ్ నాథ్ గోయంకా స్మారకోపన్యాస కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. " రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న వామపక్ష పార్టీనా, మితవాద పార్టీనా అనేది ముఖ్యంకాదు. అభివృద్ధి విధానాలతో ఏ పార్టీ అయితే ముందుకెళ్తుందో ఆ పార్టీలకు మాత్రమే భవిష్యత్తు ఉంటుందని బిహార్‌లో తాజా శాసనసభ ఎన్నికల ఫలితాలు రుజువుచేశాయి. ప్రాంతీయ పార్టీల సారథ్యంలో కేంద్రంలో లేదా రాష్ట్రంలో ఏర్పడే ప్రభుత్వాల దృష్టి మొత్తం అభివృద్ధి మీదనే ఉండాలి. భారతదేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు పెద్దగానే ఉంటాయని బిహార్ ఎన్నికలు నిరూపించాయి. అధికారం చేపట్టి సదుద్దేశంతో సత్కార్యాలు చేసే రాజకీయ పక్షాల వెంటే ప్రజలు నడుస్తారు. మళ్లీ వాళ్లకే ఓటేస్తారు. అద్భుతమైన మెజారిటీతో గెలిపించుకుంటారు. విదేశాల నుంచి తమ రాష్ట్రానికే భారీ పెట్టుబడులు వచ్చేలా బడా కంపెనీలను ఆకర్షిస్తూ, రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే రాష్ట్ర ప్రభుత్వా లను ఎప్పుడూ నా పూర్తి మద్దతు ఉంటుంది" అని అన్నారు. "బీజేపీ ఎప్పుడూ ఎన్నికల మీదే దృష్టిపెడుతుందని కొందరు అ భాండాలు వేస్తున్నారు. నిజానికి మేం ఎలక్షన్ మోడ్‌లో ఉండబోం. ఎన్నికల ప్రచారంవేళ ప్రజలతో మమేకమయ్యే ఎమోషనల్ మోడ్‌లో ఉంటాం. 24 గంటలూ అభివృద్ధి, ప్రజల భావోద్వేగాల గురించే పట్టించుకుంటాం. అందుకే ప్రతిసారి మాకు విజయం దక్కుతోంది" అని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ విమర్శలు గుప్పించారు. " నక్సలిజం, మావోయిస్ట్ టెర్రరిజంకు కొమ్ము కాస్తున్న కాంగ్రెస్ దేశంలో ఉనికిని కోల్పోతోంది. కేవలం విపక్షపార్టీగా మాత్రమే మిగిలిపో తోంది. గత 5 దశాబ్దాల్లో దేశంలో ప్రతి రాష్ట్రం మావోయిస్టుల దురాగతాలను చవిచూ సింది. దేశ రాజ్యాంగాన్ని నమ్మని అలాంటి వాళ్లను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోంది"అని మోదీ ఆరోపించారు.

# పదోసారి సీఎంగా

మహ్నార్ నియోజకవర్గంలో గెలిచిన జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుష్వాహా చేరే వీలుంది. లోక్‌జనశక్తి(ఆర్‌వీ) చీఫ్ చిరాగ్ పాశ్వాన్, హెచ్ఏఎంఎస్ చీఫ్ జితన్ రాం మాంఝీ, ఆర్ఎల్ఎం నేత ఉపేంద్ర కుష్వాహాల కేబినెట్ బెర్త్ ఖరారైందని తెలుస్తోంది. ఎల్‌జేపీ(ఆర్‌వీ)కి మూడు, హెచ్ఏఎంఎస్, ఆర్ఎల్ఎంకు చెరొకటి మంత్రి పదవి దక్కొచ్చు. బీజేపీ నుంచి 16, జేడీయూ నుంచి 14 మంది మంత్రులుగా ప్రమాణంచేసే అవకాశముంది. మరోవైపు రాష్ట్రీయలోక్‌దళ్(ఆర్జేడీ), కాంగ్రెస్ తదితర విపక్ష పార్టీల మహాగఠ్‌బంధన్ తరఫున బిహార్ అసెంబ్లీలో విపక్షనేతగా ఆర్జేడీ యువనేత తేజస్వీ యాదవ్ సోమవారం ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆర్జేడీ అధికార ప్రతినిధి శక్తి సింగ్ చెప్పారు. ఎన్‌డీఏ కూటమి తర్వాత రాష్ట్రంలో ఆర్జేడీ మాత్రమే చెప్పుకోదగ్గ స్థాయిలో 25 చోట్ల గెలిచింది. ఫలితాల్లో ప్రజల మనోగతం ప్రతిబింబించట్లేదని ఆర్జేడీ వ్యాఖ్యానించింది. దీంతో ఈవీఎంలలో అవకతవకల అంశాన్ని కోర్టులో సవాల్‌చేసే వీలుంది.

# గిగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక చట్టానికి మంత్రివర్గం ఆమోదం

రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా గిగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక చట్టం తీసుకువస్తామని ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఈ బిల్లు రూపుదిద్దుకుందని తెలిపారు. ఈ చట్టం అమల్లోకి వస్తే దేశంలోనే తొలిసారిగా గిగ్ వర్కర్ల కోసం పూర్తి స్థాయి సంరక్షణ చట్టం తీసుకొచ్చిన రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని వివరించారు.

### గిగ్ వర్కర్ల బిల్లులో ముఖ్యాంశాలు

ప్రస్తుతం తెలంగాణలో దాదాపు మూడు నుంచి నాలుగు లక్షల వరకు గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్ వర్కర్లు పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది రవాణా, డెలివరీ, లాజిస్టిక్స్ రంగాల్లో రోజుకు 10%-%12 గంటలు, వారానికి 7 రోజులపాటు పని చేస్తున్నారు. ప్లాట్‌ఫాంలు వీరి ఆదాయం నుంచి 20%-%30 శాతం వరకు కమిషన్ తీసుకోవడంతో స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత లేకపోవడం పెద్ద సమస్యగా ఉంది. ఈ పరిస్థితిని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని 'తెలంగాణ ప్లాట్‌ఫాం ఆధారిత గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ బోర్డు'ని ఏర్పాటు చేయనుంది. ఈ బోర్డు రిజిస్ట్రేషన్, సంక్షేమ పథకాల అమలు, నిధుల వినియోగంపై పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తుంది.

### నిధుల సమీకరణ విధానం

ప్లాట్‌ఫాంలకు చెల్లించే మొత్తం సొమ్ములో ఒకటి నుంచి రెండు శాతం వరకు గిగ్ వర్కర్ల సంక్షేమ నిధికి మళ్లిస్తారు. ఇదికాకుండా ప్రభుత్వం సిఎస్ఆర్ నిధులు, విరాళాలు, గ్రాంట్లను కూడా ఈ నిధిలో జమ చేయనుంది. చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో పర్యవేక్షించేందుకు రియల్-టైమ్ 'వెల్ఫేర్ ఫండ్ ఫీ వెరిఫికేషన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

## షేక్ హసీనాకు మరణశిక్ష

ట్రిబ్యునల్ సంచలన తీర్పు వెలువరిచింది. ఈ మేరకు సోమవారం జస్టిస్ మొహమ్మద్ గులామ్ మోర్తుజా మజూందార్ సారథ్యంలోని ముగ్గురు సభ్యుల ప్రత్యేక ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. కోర్టు గతంలోనే ఆమె పారిపోయిన నేరుస్తురాలిగా ప్రకటించింది. మానవత్వానికి వ్యతిరేకంగా ఆమె నిర్దయగా ఆదేశాలు జారీచేసి భద్రతబలగాల సాయంతో ఉద్యమాన్ని అణిచివేశారని, వందల మంది మరణాలకు ప్రధాన బాధ్యురాలు అని ప్రభుత్వం అందించిన సాక్ష్యాధారాలతో రూఢీ అయిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. " వందల మరణాలకు, ఉద్యమాన్ని అణచివేత వ్యూహాలకు కర్త, కర్మ, క్రియ హసీనాయే. ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం చేస్తున్న విద్యార్థులపైకి ఆమెకు చెందిన పార్టీ కార్యకర్తలు విచక్షణారహితంగా దాడులకు తెగబడేలా ఆమె రెచ్చగొట్టే ప్రకటనలు ఇచ్చారు. దాడులు చేస్తున్న వారిని ఏమాత్రం కట్టడిచేయకుండా ఆమె మానవత్వానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారు. నిరసనబాటపట్టిన వేలాది మంది విద్యార్థులపై మారణాయుధాలు, హెలికాప్టర్లతో దాడులు చేయించారు" అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. ఉద్యమకారులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడం వంటి ఘటనలతో ప్రత్యక్ష సంబంధం ఉన్న నాటి హసీనా ప్రభుత్వంలో హెూం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌కు సైతం కోర్టు మరణశిక్షను ఖరారుచేసింది. మాజీ పోలీస్ ఉన్నతాధికారి, ఇన్‌స్పెక్టర్ జనరల్ చౌదరి అబ్దుల్లా అల్-మమూన్‌కు ఐదేళ్ల శిక్ష విధించింది. గత ఏడాది ఆగస్ట్ 5న దేశం నుంచి పారిపోయి ఢిల్లీలో ఆశ్రయం పొందుతున్న అవామీ లీగ్ పార్టీ అధినేత్రి హసీనాను తమకు అప్పగించాలని భారత్‌ను బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం కోరింది. ఈ మేరకు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సోమవారం ఒక ప్రకటన విడుదలచేసింది. " భారత్‌కు పారిపోయిన హసీనా, అసదుజ్జమాన్ ఖాన్ కమాల్‌లను వెంటనే బంగ్లాదేశ్ ఉన్నతాధికారులకు అప్పగించండి. గతంలో మన రెండు శాల మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒడంబడికను గౌరవించాల్సిందే. కోర్టు తీర్పుతో దోషులుగా నిర్ధారణ అయిన ఖైదీలను మాకు భారత ప్రభుత్వం అప్పగించాలి. దోషులు అని తేలాకకూడా వాళ్లను ఆశ్రయం కల్పించడం స్నేహపూర్వక చర్య అనిపించుకోదు. ఇలాంటి ధోరణి న్యాయబద్ధంకాదు" అని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ ఆ ప్రకటనలో పేర్కొంది. "ఈ మేరకు మరోసారి భారత్‌కు అధికారికంగ లేఖ రాస్తాం. ఊచకోత కారకులకు ఇంకా ఆశ్రయం కల్పిస్తామని భారత్ మొండికేస్తే రెండుదేశాల మధ్య విరోధం పెరుగుతుంది" అని ప్రభుత్వ న్యాయ సలహాదారు అసిఫ్ నజ్రుల్ స్పష్టంచేశారు. దీనిపై భారత్ స్పందించింది. బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తామని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదలచేసింది.

### తీర్పు తర్వాత పలు చోట్ల ఘర్షణలు

తమ పార్టీ చీఫ్ హసీనాకు మరణశిక్ష ఖరారుచేస్తూ తీర్పు వెలువడటంతో అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలు రెచ్చిపోయారు. దేశవ్యాప్తంగా కీలక నగరాలు, పట్టణాల్లో ఆందోళనకు దిగారు. దీంతో పలు చోట్ల ఘర్షణలు జరిగాయి. ఆపద్ధర్మ ప్రభుత్వ అనుకూల వర్గాలు సైతం రోడ్లమీదకొచ్చాయి. ఢాకాలో హసీనా తండ్రికి చెందిన భవనాన్ని కూల్చేందుకు యత్నించగా పోలీసులు బాష్పవాయుగోళాలు ప్రయోగించారు. లాఠీచార్జ్ చేసి నిరసనకారులను చెదరగొట్టారు. 1947 సెప్టెంబర్ 28వ తేదీన నాటి తూర్పు పాకిస్తాన్‌లో హసీనా జన్మించారు. ఈమె తండ్రి షేక్ ముజిబుర్ రెహ్మాన్ 1971లో బంగ్లాదేశ్ విమోచన కోసం పోరాడి తర్వాత బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం సిద్ధించేలా కృషిచేవారు. తర్వాత బంగ్లాప్రజలు ఆయనను జాతిపితగా కీర్తించారు. ఢాకా యూనివర్సిటీలో ఈమె చదువుకున్నారు. 1968లో అణుశాస్త్రవేత్త ఎంఏ వాజెద్ మియాను పెళ్లాడారు. 1975లో సైనిక తిరుగుబాటు వేళ తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులు, ఇతర కుటుంబసభ్యులు హత్యకు గురయ్యారు.

## కాంగ్రెస్ హత్య రాజకీయాలకు పాల్పడుతోంది ::: కవిత

ఖమ్మం జిల్లా: పాతర్లపాడులో సిపిఎం నేత సామినేని రామారావు కుటుంబాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పరామర్శించింది. ఇటీవల సామినేని రామారావు కుటుంబంలో జరిగిన విషాదం నేపథ్యంలో కవిత అక్కడికి వెళ్లి బాధితులను ఓదార్చింది. అనంతరం కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ హత్య రాజకీయాలకు పాల్పడుతోందని, జరిగిన హత్యపై నిష్పక్షపాత విచారణ జరిపి.. హంతకులను వెంటనే అరెస్టు చేయాలని కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులకు బెదిరించడం, భయపెట్టడం అలవాటని కవిత విమర్శించారు. రాష్ట్రస్థాయిలో రామారావు హత్యపై పోరాడేందుకు అండగా ఉంటానని కవిత హామీ ఇచ్చారు. ఈ ఘటనపై డీజీపీ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రస్థాయిలో రామారావు హత్యపై పోరాడేందుకు అండగా ఉంటానని కవిత హామీ ఇచ్చారు.



## భూపతిపూర్ లో పూర్వ విద్యార్థుల చేయూత

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 17

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005-06 పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో విద్యార్థుల భోజన హాల్ కు తలుపులు లేవని తెలుసుకొని రెండు ఇనుప తలుపులు చేయించి ఆదర్శంగా నిలిచారు. వీరిని ప్రధానోపాధ్యాయులు వెంకటరమణి అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తీగల విష్ణు, వెంకట కృష్ణ, విజయ్, వెంకటేష్, బాబాఖాన్, పాఠశాల మాజీ యాజమాన్య కమిటీ చైర్మెన్ జక్కుల రాజేంద్రప్రసాద్ ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, వేణు, సంజయ్, శంకరయ్య, రాజగోపాల్, సురేష్, హుస్సేన్, వంశీ, కమారుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో రెండవ రోజు జయంతోత్సవం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 17 : శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయముజగిత్యాల లో ఘనంగా ప్రారంభమైన శ్రీ ధన్వంతరి జయంతోత్సవము, శ్రీ ధనలక్ష్మి సమేత శ్రీ ధన్వంతరి స్వామి కళ్యాణ మహోత్సవ రెండవ రోజు నవంబర్ 17 సోమవారం కార్తీక మాసం శుక్ల పక్షం త్రయోదశి ఉ.గం. 5.15 ని.ల కు సుప్రభాత సేవ, ధృవమూర్తులకు అభిషేకములు. ఉ.గం. 10-15 సుదర్శన సమేత శ్రీ ధన్వంతరి మూల మంత్ర యాగము (ఆరోగ్య హోమము) అంగరంగ వైభవంగా జరిగింది. ఇట్టి కార్యక్రమములో ఫౌండర్ అండ్ ఛైర్మెన్ డాక్టర్ వడ్ల గట్ట రాజన్న, వోడ్నాల శ్రీనివాస్-లత, భారతాల రాజసాగర్, వడ్ల గట్ట శంకర్, వడ్ల గట్ట గోపి, జితేందర్- అవంతిక, బాలే వెంకటేష్- రమాదేవి, కలకుంట్ల ప్రవీణ్ కుమారీ- అంజలీ, అర్చకులు ప్రణయ్, నరేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



## మిర్యాలగూడ సీనియర్ ఫోటో జర్నలిస్టుకు జాతీయస్థాయి పురస్కారం

మిర్యాలగూడ నవంబర్ 17:-( వార్త మిర్రర్) జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన సీనియర్ ఫోటో జర్నలిస్ట్ పుట్టా నాగేశ్వరరావుకు నేషనల్ జర్నలిస్ట్ వెల్ఫేర్ బోర్డు (ఒడిశా) జాతీయస్థాయి పురస్కారం ఆదివారం అందుకున్నారు. జాతీయస్థాయిలో వివిధ విభాగాలకు చెందిన 35 మంది సీనియర్ జర్నలిస్టులకు జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా భువనేశ్వర్ లో జ్ఞాపికలు అందించి సత్కరించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి సీనియర్ ఫోటో జర్నలిస్ట్, ఫోటోపత్రిక ఎడిటర్ నాగేశ్వరరావుకు జ్ఞాపిక అందచేసి సన్మానించారు. కార్యక్రమంలో ఒడిస్సా అసెంబ్లీ స్పీకర్ సురామా పాఢీ, చీఫ్ సెక్రటరీ మనోజ్ ఆహుజ, మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ శత్రుఘ్న పూజారి, ఒడిస్సా సమాచార పౌర సంబంధాల అధికారి హేమంత్ శర్మ, నేషనల్ జర్నలిస్ట్ వెల్ఫేర్ బోర్డు జాతీయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ప్రదోష్ పట్నాయక్, ప్రద్యుమ్న కుమార్ మహంతి, జనరల్ ఎడిటర్ సత్ మిశ్రా, పాల్గొన్నారు. ఫోటో జర్నలిస్ట్ నాగేశ్వరరావు జాతీయ పురస్కారం అందుకున్న సందర్భంగా సీనియర్ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి, మిర్యాలగూడ పాత్రికేయులు ఖాజా హమీదుద్దీన్, ఎండి. ఆస్లాం, రంగా శ్రీనివాస్, బొంగరాల మట్టయ్య, కె.నాగచారి, పైలం వెంకట్, ప్రజలహరి ఎడిటర్ చిట్యాల శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

## డిజిటల్ గోల్డ్‌లో పెట్టుబడులు పెట్టొద్దు : ప్రజలను హెచ్చరించిన సెబీ



న్యూఢిల్లీ, నవంబర్ 8: రికార్డు స్థాయికి చేరుకున్న ధరల కారణంగా బంగారంపై పెట్టుబడుల కోసం చాలా మంది ఇటీవల కాలంలో డిజిటల్ గోల్డ్ వైపు మళ్లుతున్నారు. ఇంటినుంచే కొనుగోలుకు అవకాశాలు ఉండటంతో ఈ తరహా కొనుగోళ్లకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన మార్కెట్ నియంత్రణ మండలి సెబీ.. డిజిటల్ గోల్డ్ లేదా ఈ-గోల్డ్‌లో పెట్టుబడులు పెట్టేవారిని తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. డిజిటల్ లేదా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో లభించే గోల్డ్ ఉత్పత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వీటి పెట్టుబడులకు దూరంగా ఉండాలని మదుపరులకు సూచించింది. దీనివల్ల ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందటూ ఒక హెచ్చరికను జారీ చేసింది. కొన్ని డిజిటల్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ పెట్టుబడిదారులు డిజిటల్ గోల్డ్ ప్రొడక్ట్‌లను అందిస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. భౌతిక బంగారంలో పెట్టుబడికి ప్రత్యామ్నాయంగా డిజిటల్ గోల్డ్ ఇటీవలకాలంలో భారీగా ప్రాచుర్యం పొందింది. అటువంటి డిజిటల్ గోల్డ్ ఉత్పత్తులు సెబీ నియంత్రణ పరిధిలోకి రావు. ప్రస్తుత చట్టాల ప్రకారం అవి సెక్యూరిటీలు గానీ, కమోడిటీ డెరివేటివ్‌లు కావు కాబట్టి వాటికి సెబీ నియంత్రణ వర్తించదు. అవి పూర్తిగా సెబీ వెలుపల పనిచేస్తాయి. అలాంటి ఉత్పత్తులకు సెక్యూరిటీల మార్కెట్ పరిధిలోని పెట్టుబడిదారుల రక్షణ విధానాలు ఏవి వర్తించవని పేర్కొంది. డిజిటల్ గోల్డ్‌లో కౌంటర్‌పార్టీ, ఆపరేషనల్ రిస్కుల నుంచి ప్రమాదం పొంచివుంటాయని హెచ్చరించారు. సదరు ప్లాట్‌ఫాం తిరిగి డబ్బు చెల్లించలేకపోవడం, నిర్వహణ పరమైన ఇబ్బందులకు ఆస్కారం ఉంటుందని హెచ్చరించింది.

# భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ అవకాశాలపై ఫౌండేషన్ దృష్టి

**- మహిళలకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు**

**- ఐక్యత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు కృష్ణారెడ్డి**



కల్వకుర్తి నవంబర్ 17 వార్త మిర్రర్ ప్రతినిధి:-మహిళల ఆర్థిక అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు ప్రశంసనీయంగా నిలుస్తున్నాయి. టాస్క్- సి ఓ ఓ,ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో ఇప్పటి వరకు 300 మంది మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించారు.తాజాగా నిర్వహించిన ఇంటర్వ్యూలలో 71 మంది మహిళలు ఎంపిక కాగా,వారు సోమవారం తుక్కుగూడలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఉద్యోగాల్లో చేరారు.ఈ సందర్భంగా అక్కడిను సందర్శించిన ఐక్యత ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ...మహిళలు ఉద్యోగాల్లో చేరడం కుటుంబ ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తుంది. పిల్లల విద్య, వైద్య, గృహ అవసరాలపై భారం తగ్గుతుంది. ఒక మహిళ ఉద్యోగం పొందడం అంటే మొత్తం కుటుంబానికి ఆర్థిక భరోసా లభించినట్టే" అని అభిప్రాయం వ్యక్తం చేశారు.వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామం, కల్వకుర్తి, ఆమనగల్ మండలాల నుండి వచ్చిన 71 మంది మహిళలు ఉద్యోగాల్లో చేరినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శేఖర్, శ్రీపతి, కళ్యాణ్ ఇతరులు పాల్గొన్నారు.

## చీకటి సమస్యను చూసి స్పందించి వీధి దీపాలను పంపిణీ చేసిన గ్రామ యువకుడు రాఘవేందర్



వార్త మిర్రర్ నవంబర్ 17: నవాబ్‌పేట్ మండలం: లింగంపల్లి గ్రామంలో చీకటి సమస్యను వార్త మిర్రర్ పత్రికలో చూసి స్పందించిన యువకుడు కె. రఘువేందర్ వెంటనే స్పందించారు. గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని 'చీకటిని తొలగించాలి' అనే సంకల్పంతో తన సొంత డబ్బులతో వీధి దీపాలను కొనుగోలు చేసి గ్రామపంచాయతీ అధికారికి అధికారికంగా అప్పగించడమే కాకుండా గ్రామంలో ఎక్కువగా చీకటి ఉండే వెనుక వీధులు, ప్రాంతం, పల్లె చివరి దారుల్లో ముందుగా ఏర్పాటు చేయాలని సూచించారు అధికారులు త్వరలో వీటిని అవసరమైన ప్రాంతాల్లో అమర్చనున్నట్లు తెలిపారుగ్రామంలో చాలా కాలంగా రాత్రివేళ మహిళలు, పిల్లలు, వృద్ధులు చీకటి కారణంగా ఇబ్బందులు పడుతున్న విషయం ఇటీవలే వార్తగా బయటపడింది ఈ సమస్యను గమనించి ఎవరైనా చర్య తీసుకోవాలనే సమయంలో ప్రభుత్వాన్ని ఎదురు చూడకుండా యువకుడు రఘువేందర్ స్వయంగా ముందుకొచ్చిన తీరు గ్రామస్థులను ఆకట్టుకుందివ్యక్తిగత ప్రయోజనం లేకుండా గ్రామాభివృద్ధి కోసం సొంత డబ్బులు ఖర్చు చేసి పంచాయతీకి అవసరమైన సామగ్రిని అందజేయడం నేటి తరానికి ఆదర్శమని గ్రామస్తులు తెలిపారు "ప్రతి ఒక్కరు గ్రామం కోసం ఒక దీపం వెలిగిస్తే%ా% పల్లె మొత్తం వెలిగిపోతుంది" అని గ్రామస్థులు రఘువేందర్‌ను అభినందిస్తూ తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొనడం జరిగింది

# కల్వకుర్తిలో ఆర్టీసీ బస్సు నడిపిన ఎమ్మెల్యే



కల్వకుర్తి నవంబర్ 17 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి ఆర్టీసీ బస్టాండ్ లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం కొత్త బస్సులను ప్రారంభించారు కల్వకుర్తి నుండి గచ్చిబౌలి శ్రీశైలం రహదారుల ఏర్పాటు చేసిన ఈ కొత్త సర్వీసులను ఎమ్మెల్యే స్వయంగా నడిపి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ కొత్త బస్సులు కల్వకుర్తి, గచ్చిబౌలి, శ్రీశైలం రహదారుల్లో సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తాయి. ప్రయాణికుల సౌకర్యం మరియు సమయపాలన మన ప్రధాన లక్ష్యమని ప్రజలు భద్రతగా, సౌకర్యంగా వెళ్ళడానికి ప్రభుత్వ ట్రాన్స్‌పోర్ట్ సేవలు మరింత బలోపేతం చేయాలని నిరంతరం ప్రయత్నిస్తున్నామన్నారు. కొత్త బస్సులు స్థానిక ప్రజలకు ఉపయోగకరంగా, వాణిజ్య, పర్యాటక కార్యకలాపాలను ప్రోత్సహిస్తాయని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్ ఠాగూర్, బృంగి ఆనంద్ కుమార్, డిపో మేనేజర్ సుభాషిని, పార్టీ నాయకులు సంజీవ్ యాదవ్, శ్రీకాంత్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# మహారుద్రాభిషేకంలో పాల్గొన్న తల్లోజు ఆచారి



కల్వకుర్తి నవంబర్ 17 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి పట్టణంలోని గచ్చిబౌలి శివాలయంలో సోమవారం ఉదయం నిర్వహించినటువంటి మహారుద్రాభిషేకంలో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి పాల్గొని రుద్రాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి గచ్చిబౌలిలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ప్రముఖ ఆర్కియాలజిస్ట్ కల్పనా రమేష్ గచ్చుబావిని సందర్శించిన సందర్భంగా వారితో గచ్చుబావి యొక్క అభివృద్ధి పనుల పై చర్చించారు. వందల ఏళ్ల పురాతనమైన శివాలయాన్ని గచ్చిబౌలి పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని దానికి మీ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా గచ్చుబావి యొక్క దీనస్థితిని సోషల్ మీడియా వేదికగా ప్రపంచం ముందు ఉంచి వందలాదిమంది గచ్చిబావి అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనాలా చేసిన కల్వకుర్తి డైరీస్ పేజి నిర్వాహకుడు కల్వ కార్తీక్ ను శాలువతో సత్కరించి సన్మానం చేశారు. యువత ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో సంతోషమని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు




## కేజీబీవీ లో ఉద్యోగం కొరకు దరఖాస్తుల ఆహ్వానం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 17 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం లోని ఉప్పుమడుగు కేజీబీవీ లో స్వీపర్ కం స్కావెంజర్ (స్వీపర్ కమ్ స్కావెంజర్)గా పని చేయుటకు ఆసక్తి గల మహిళా అభ్యర్థినిల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతుంది. అర్హతలు: రాయికల్ మండల కేంద్రానికి సంబంధించిన వారు అయి ఉండి 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి 18 నుండి 45 సం. వయస్సు వారు అర్హులు. పైన తెలిపిన అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు ఈ నెల 19వ తారీకు సాయంత్రం వరకు రాయికల్ కేజీబీవీ లో దరఖాస్తులు సమర్పించవలసిందిగా మండల విద్యాధికారి ఎస్.రాఘవులు ఒక ప్రకటన తెలపడం జరిగింది. వివరాలకు కేజీబీవీ పాఠశాల ప్రధానోపోధ్యాయురాలు ఎన్.శోభారాణి సెల్ మొబైల్:8008476752 కి సంప్రదించగలరు.



## ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ సౌజన్యంతో మందులు అందజేత

సంస్థాన్ నారాయణపూర్ నవంబర్ 17( వార్త మిర్రర్):

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని కదారి శంకరమ్మ, ఇటీవల అనారోగ్యానికి గురైంది.ఈమె తీవ్ర కీళ్ల నొప్పుల వ్యాధితో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ నారాయణపురం సభ్యులచే విషయం తెలుసుకున్న ఇ ఎల్ వి ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ సత్వరమే స్పందించి కదారి శంకరమ్మకు రెండు నెలలకు సరిపడా మందులను ఆమెకు అందించారు.ఈ కార్యక్రమంలో ఈ ఎల్ వి ఫౌండేషన్ సభ్యులు, బాలకృష్ణ, ముత్యాలు, ప్రభాకార్, సాయి, సురేష్ సతీష్, రఘు, హేమెంధర్, ప్రవీణ్, సురేష్ గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపు.. 27% పెరిగిన బజాజ్ ఫైనాన్స్ రుణాలు!

హైదరాబాద్ : భారతదేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ నాన్-బ్యాంకింగ్ రుణదాత, బజాజ్ ఫిన్‌సర్వ్‌లో భాగమైన బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఈ పండుగ సీజన్‌లో వినియోగ ఫైనాన్స్‌లో పెరుగుదల కనిపించింది. రికార్డు స్థాయిలో బజాజ్ ఫైనాన్స్ రుణాల్లో 27 శాతం పెరుగుదల కనిపించింది. జీఎస్టీ సంస్కరణలు, వ్యక్తిగత ఆదాయ పన్నుల్లో మార్పుల కారణంగా కొనుగోళ్లు పెరిగాయి. ఈ క్రమంలో ఈ ఏడాది సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 26వ తేదీ వరకు సుమారు 63 లక్షల రుణాలను పంపిణీ చేసింది. ఇక కొత్తగా 23 లక్షల కొత్త కస్టమర్లను సంపాదించింది."రోజువారీ ఉత్పత్తుల ధరలను తగ్గించడంతో లక్షలాది మధ్య, తక్కువ ఆదాయ కుటుంబాలు ఎక్కువ ఖర్చు చేయడానికి దోహదం చేసింది. వినియోగ రుణాల పంపిణీలో 27 శాతం అధిక పంపిణీలో సానుకూల ప్రభావం చూపించింది. మెరుగైన జీవనశైలి కోసం వినియోగదారులు ఎక్కువ నాణ్యత ఉండే వస్తువులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పండుగ సీజన్‌లో మా కొత్త కస్టమర్లలో సగానికి పైగా కొత్తగా క్రెడిట్ పొందారు. అధికారిక ఆర్థిక వ్యవస్థ నుంచి చాలా మంది మొదటి లోన్ తీసుకుంటున్నారు. బజాజ్ ఫైనాన్స్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, 4,200 ప్రదేశాలలో 2,39,000 క్రియాశీల పంపిణీ పాయింట్ల వద్ద మేము ఆర్థిక చేరికను మరింతగా పెంచడం.. వినియోగదారుల పెరుగుదలకు శక్తినివ్వడం కొనసాగిస్తున్నాము అని బజాజ్ ఫైనాన్స్ ఛైర్మన్ సంజీవ్ బజాజ్ అన్నారు. టీవీలు, ఎయిర్ కండిషనర్లకు తక్కువ జీఎస్టీ విధించడంతో బెస్ట్ బ్రాండ్స్‌ను కొనుగోలు చేసేందుకు వినియోగదారులకు వీలు కలిగింది. టీవీలకు కన్స్యూమర్ ఫైనాన్సింగ్ స్పష్టమైన ప్రీమియమైజేషన్ ధోరణిని చూసింది. 40-అంగుళాలు, అంతకంటే ఎక్కువ స్క్రీన్‌ల కోసం రుణాలు కంపెనీ ద్వారా ఫైనాన్స్ చేసిన మొత్తం టీవీలలో 71 శాతం వాటాను కలిగి ఉన్నాయి. గత సంవత్సరం ఇది 67 శాతంగా ఉంది. మొబైల్ ఫోన్లు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, ఫర్నిచర్, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్‌లు, అనేక ఇతర వినియోగ-ఆధారిత వర్గాల ఫైనాన్సింగ్‌లో గణనీయమైన ఉనికిని చాటుకున్నాం అని సంజీవ్ బజాజ్ చెప్పుకొచ్చారు. బజాజ్ ఫైనాన్స్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, ఆన్-గ్రౌండ్ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ల ద్వారా 110 మిలియన్ల కస్టమర్ ఫ్రాంచైజీకి సేవలు అందిస్తోందని ఆయన తెలిపారు. జూన్ 30, 2025 నాటికి 75.1 మిలియన్ల నికర ఇన్‌స్టాల్‌లతో బజాజ్ ఫిన్‌సర్వ్ యాప్ వేగవంతమైన సేవలను అందిస్తోందన్నారు. సెప్టెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించిన నెక్ట్స్ జనరేషన్ జీఎస్టీ సంస్కరణలు 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' ప్రారంభానికి గుర్తుగా నిలిచాయని సంజీవ్ బజాజ్ తెలిపారు.

# మిర్యాలగూడ నియోజకవర్గంలో 171.5 కోట్ల రూపాయల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి





మిర్యాలగూడ నవంబర్ 17:- (వార్త మిర్రర్)నల్లగొండ జిల్లా, మిర్యాలగూడ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు.సోమవారం అయన రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డితో కలిసి మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 171.5 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు .శెట్టిపాలెం నుండి అవంతిపురం వరకు 74 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నాలుగు లైన్ల రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. 15 కోట్ల రూపాయల టి ఎఫ్ యు ఐ డి సి నిధులతో చేపట్టిన రోడ్డు , 16 కోట్ల రూపాయల టి ఎఫ్ యు ఐ డి సి నిధులతో చేపట్టిన సిసి రోడ్డు ,మురికి కాలువలను ప్రారంభించారు.మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో41 కోట్ల రూపాయల బీటీ, సీసీ రోడ్డు పనులను,15 కోట్ల రూపాయల వ్యయంతో మిర్యాలగూడ నుండి తడకమళ్ళ వరకు ఉన్న డబుల్ రోడ్డు ను 6 లైన్లుగా మార్చే పనులకు, మూడు కోట్ల రూపాయల వ్యయంతో ప్లైఓవర్ ఏరియా, మున్సిపాలిటీ ఏరియా, మున్సిపాలిటీ ఆఫీసు ఏరియా సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. 5 కోట్ల రూపాయల వ్యయంతో కేఎన్ఎమ్ డిగ్రీ కళాశాలలో నిర్మించిన అదనపు భవనాన్ని , అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల లో 2.25 కోట్ల రూపాయలతో నిర్మించిన అదనపు భవనాన్ని మంత్రులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాలలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో సాగునీరు అందించే ఆయకట్టు లో ఎక్కడా సమస్యలు లేకుండా నీరిస్తామని, అలాగే మొదలుపెట్టిన అన్ని ఎత్తిపోతల పథకాలను నూటికి నూరు శాతం పూర్తి చేస్తామని, మిర్యాలగూడ అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు .రాష్ట్రంలో ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధికి తామందరము కట్టుబడి ఉన్నామని అన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ప్రతి ఒక్కరికి 6 కిలోల సన్నబియ్యాన్ని ఇస్తున్నామని, గత ప్రభుత్వం పది సంవత్సరాలలో ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వలేదని,తాము అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తున్నామని, ఇంకా ఎవరైనా మిగిలిపోయి ఉంటే వారికి కూడా రేషన్ కార్డులు ఇస్తామని, ధాన్యం సేకరణలో భాగంగా ప్రతి గింజను కొంటామని, ప్రతి వరి రైతుకు న్యాయం చేస్తామన్నారు. ధాన్యం అమ్మిన రైతుల ఖాతాలలో 72 గంటల్లో నిధులు జమ చేస్తున్నామని, ఉచిత విద్యుత్తు, ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని, సమాజంలో అన్ని వర్గాల మేలు కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని ,ఎస్సీ వర్గీకరణ పూర్తి చేశామని, 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇచ్చేందుకు దృఢ సంకల్పంతో ఉన్నామని, సామాజిక న్యాయం సంకల్పంతో ముందుకెళ్తున్నామని, ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో మెయిన్ కెనాల్ లైనింగ్ కి 57 కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అంతేకాక నియోజకవర్గంలోని దుబ్బ తండ, శాంతినగర్, రావులపెంట చెక్ డాంల నిర్మాణానికి 24 కోట్ల రూపాయలను, ఫీడర్ చానళ్ల నిర్మాణానికి సుమారు 20 కోట్ల రూపాయలను మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. నిర్మాణంలో ఉన్న 5 లిఫ్ట్ ఇరిగేషన్లను త్వరలోనే పూర్తి చేస్తామని వెల్లడించారు.రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో 250 కోట్ల రూపాయలతో హ్యాం రోడ్లు మంజూరు చేయడం జరిగిందని, ప్రతి గ్రామం నుండి మండల కేంద్రానికి డబుల్ రోడ్డు నిర్మిస్తున్నామని, నాగార్జునసాగర్ నియోజకవర్గానికి 450 కోట్లు, దేవరకొండ నియోజకవర్గానికి 350 కోట్లతో హ్యాం రోడ్లకు టెండర్లు పిలవనున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 65 వేల కోట్ల రూపాయలతో తెలంగాణ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా ఆర్ అండ్ బి రహదారులు చేపడుతున్నామని తెలిపారు. రేషన్ కార్డులు ,ఇందిరమ్మ ఇండ్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. హైదరాబాద్- విజయవాడ రహదారిని 10,500 కోట్లతో చేపట్టనున్నామని, హైదరాబాద్- చిట్యాల రోడ్డు 7600 కోట్లతో చేపట్టనున్నామన్నారు. నల్గొండ జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని తెలిపారు.స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ 250 కోట్ల రూపాయలతో హ్యాం రోడ్లను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నీటిపారుదల కింద చేపట్టిన పనులన్ని పురగతిలో ఉన్నాయని ,నియోజకవర్గ అభివృద్ధికి మంత్రులు పూర్తి సహకారం అందించాలని కోరారు.నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి తదితరులు మంత్రుల వెంట ఉన్నారు. కాగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెలిప్యాడ్ వద్ద మంత్రులకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.కార్యక్రమాలలో అదనపు ఎస్పి రమేష్ డీఎస్పీ రాజశేఖర్ రాజు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున అధ్యక్షులు శ్రీనివాస్ ఆసుపత్రిలో ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు కోసం 25 లక్షల రూపాయల చెక్కును మంత్రులకు అందజేశారు.

# ప్రేక్షకులను అలరించిన నాట్యతోరణం..

## ఐదురకాల నృత్యరీతులు.. జుగల్‌బందీ

## కరతాళ ధ్వనులతో నిండిపోయిన శిల్పకళావేదిక..



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : ఒకటి కాదు.. రెండు కాదు.. ఐదు రకాల నృత్య రీతులతో పాటు జుగల్‌బందీని కూడా కలగలిపి ప్రదర్శించిన నాట్యాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గత ఐదు సంవత్సరాలుగా అమృత కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నృత్యపండుగ.. హైటెక్ సిటీలోని శిల్పకళావేదికలో ఆదివారం నగరవాసులను అలరించింది. సాయంత్రం 4 గంటల నుంచి దాదాపు రెండున్నర గంటల పాటు భరతనాట్యం, కూచిపూడి, కథక్, మోహినీఅట్టం, ఒడిస్సీ, జుగల్‌బందీ రీతులను పలువురు నర్తకులు, నర్తకీమణులు ప్రదర్శించారు. 40 మందికి పైగా నాట్యకారులంతా అత్యంత హృద్యమైన రీతుల్లో నాట్యభంగిమలు చూపించడంతో శిల్పకళావేదిక మొత్తం కరతాళధ్వనులతో నిండిపోయింది. ఈ సందర్భంగా అమృత కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రాజేష్ పగడాల మాట్లాడుతూ అశేష ప్రేక్షకాదరణ వల్లే మేం నాట్యతోరణం కార్యక్రమాన్ని ఇన్నేళ్లుగా హైదరాబాద్ నగరం లో నిర్వహించగలుగుతున్నాం. ఇది మాకు మరో మైలురాయి. ఇన్నాళ్ల పాటు చేసిన ప్రయత్నాలు, ఎన్నో రాత్రులు చేసిన కృషి, రిహార్సల్స్, ప్రణాళిక.. ఇవన్నీ కలిపి గుదిగుచ్చిన మాలగానే ఈ నాట్యతోరణం రూపొందింది. అందుకే.. మీ అందరికీ కృతజ్ఞతతో, రెట్టించిన ఉత్సాహంతో ప్రేక్షక మహాశయులందరినీ మా ఐదో వార్షిక కార్యక్రమం నాట్యతోరణానికి సాదరంగా ఆహ్వానం పలుకుతున్నాం. ఈ రోజు మేం చూపిస్తున్నది కేవలం నాట్యాలు మాత్రమే కాదు.. ఐదేళ్ల నిబద్ధత, ఎదుగుదల, సమిష్టి విజయాలు. మేం తొలిసారి నాట్యతోరణాన్ని రూపొందించినప్పుడు మా లక్ష్యం మీద మాకు చాలా స్పష్టత ఉంది. ఇది కేవలం మరో నృత్య కార్యక్రమంగా మిగిలిపోకూడదని, మన సంప్రదాయాన్ని గౌరవించే వేదికగా ఉండాలని, విభిన్న కళారూపాలను ఒక చోటుకు తీసుకురావాలని, యువ నృత్యకళాకారులు తగిన గౌరవాన్ని పొంది తమ ప్రతిభను కనబర్చడానికి ఒక వేదిక ఇవ్వాలని భావించాం, సాధించాం. ఒక ఆలోచనతో కూడిన ప్రయోజనాన్ని.. అత్యంత ప్రభావం చూపగల ఒక సంస్థగా మారిస్తే అదే అమృత కల్చరల్ ట్రస్ట్ అయ్యింది" అన్నారు. అమృత కల్చరల్ ట్రస్ట్ ట్రస్టీ భార్గవి పగడాల మాట్లాడుతూ, "ఈ ఐదేళ్లలో మేం 700 మందికి పైగా యువ నృత్యకారులు, ఏడు రకాల నృత్యరీతులకు అవకాశం కల్పించాం. ప్రతియేటా 50కి పైగా నృత్య పాఠశాలలు, 25 మందికి పైగా విశిష్ట గురువులు మా వేదికను, మా లక్ష్యాన్ని నమ్ముతున్నారు. ఈ కొత్త అధ్యాయంలోకి అడుగుపెడుతున్న అమృత కల్చరల్ ట్రస్టు.. తన లక్ష్యంపై దృష్టి కేంద్రీకరించి, ఎంతో ఉత్సాహంగా ముందడుగు వేస్తోంది. రాబోయే ఐదేళ్లలో మరిన్ని నగరాల్లో, మరిన్ని పాఠశాలల్లో, మరింత మంది యువ కళాకారులకు అవకాశం కల్పించాలన్నది మా లక్ష్యం. సంప్రదాయ నృత్యకళపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ ఒక వేదిక కల్పిస్తాం. ప్రతియేటా కేవలం నృత్య కార్యక్రమాలే కాక వర్క్‌షాప్‌లు, మాస్టర్ క్లాస్‌లు, శిక్షణ కార్యక్రమాలు, ఏడాదంతా నేర్చుకునే అవకాశాలు అందిస్తాం. స్కాలర్‌షిప్‌లు, మెంటార్‌షిప్‌ల ద్వారా యువ కళాకారులకు తమ కళా ప్రయాణంలో మద్దతు ఇస్తాం.గురువులు, నృత్య పాఠశాలలు, సాంస్కృతిక సంస్థలతో అనుబంధంతో మరింత ప్రభావం చూపే కార్యక్రమాలు నిర్వహిస్తాం. నాట్య తోరణాన్ని ఒక జాతీయ సాంస్కృతిక గుర్తింపుగా మారుస్తాం. యువ కళాకారులకు దేశంలోనే అత్యంత గౌరవప్రదమైన వేదికపై తమ కళను ప్రదర్శించే అవకాశం ఇస్తాం. ఐదేళ్ల క్రితం తొలిసారి మేం నాట్యతోరణం నిర్వహించిన రోజు ఇప్పటికీ గుర్తుంది. ఒక చిన్న బృందం ఎంతో ఉత్సాహంతో ఆరోజు ముందుకొచ్చింది. అప్పటికి పెద్ద వేదిక లేదు, వందలమంది నృత్యకారులు లేరు. ఉన్నదంతా రెట్టించిన ఉత్సాహం, మా మీద మాకు నమ్మకమే. ఇప్పుడు గౌరవనీయులైన గురువుల చేతుల్లో రూపొందిన కొత్తతరం కళాకారులు, ఇన్ని వందల మంది ప్రేక్షకుల ఆదరణ, తమ ప్రతిభను ఆత్మవిశ్వాసంతో ప్రదర్శించడానికి సిద్ధంగా ఉన్న యువ కళాకారులు, తమ పిల్లల ఎదుగుదలను చూసి ఆనందబాష్పాలు రాలుస్తున్న తల్లిదండ్రులు, నాట్యతోరణానికి అపార మద్దతు ఇస్తున్న ఇంతమంది పెద్దలు అందరూ మాతో ఉన్నారు. మీ ఆదరాభిమానాలు సదా మాతో ఉండాలని ఆశిస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. చంద్రశేఖర్, అదనపు డీజీపీ అనిల్ కుమార్, ఆచార్య కళాకృష్ణ, సంగీత నాటక అకాడమీ అవార్డు విజేత దీపికారెడ్డి, మైహోం గ్రూప్ వైస్ ఛైర్మన్ జూపల్లి జగపతిరావు, సాయి సిల్క్స్ కళామందిర్ వ్యవస్థాపకుడు, ఎండీ చలవాది ప్రసాద్, కేఫ్ నీలోఫర్ ఛైర్మన్ అనుముల బాబూరావు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ ఉషారామన్, పీఆర్ డిజైన్ హౌస్ సీఎండీ పార్వతి రెడ్డి పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల ను తనిఖీ చేసిన..మున్సిపల్ కమిషనర్ వెంకట్రాంరెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 17

చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో నూతనంగా నిర్మాణం చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాం రెడ్డి తదనంతరం మాట్లాడుతూ మున్సిపాలిటీలోని మొత్తం 300 కు గాను వివిధ నిర్మాణ దశల్లో ,రూఫ్ లెవెల్100 ఇండ్లు, లెంటల్ లెవల్లో 160 ఇండ్లు, మరియు నిర్మాణం పూర్తయిన ఇండ్లు మూడింటిలో రెండింటిని ఆవుల మమత, చిన్న కొండూరు రోడ్ హనుమాన్ టెంపుల్ పక్కన నిర్మించుకున్న ఇంటిని శ్యామల అన్నపూర్ణ శివాజీ నగర్, బక్క సత్తమ్మ మున్సిపల్ కార్మికురాలు ఇండ్ల నిర్మాణాలను) పర్యవేక్షించడం అయినది.ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ రామ్, నారాయణమూర్తి,బిల్ కలెక్టర్ భాస్కర్, సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ సునీల్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.



## జాతర ఏర్పాట్లను పరిశీలించిన సీఐ రామ్ నరసింహారెడ్డి...

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 17 జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం మల్లన్న పేట గ్రామంలో ఈ నెల 26 నుండి వచ్చే నెల 18 వరకు ప్రతి ఆది, బుధవారల్లో ఏడు వారాల పాటు జరగనున్న శ్రీ మల్లికార్జున స్వామి (దొంగ మల్లన్న) జాతరకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం రోజు ధర్మపురి సిఐ రామ్ నరసింహా రెడ్డి పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని, దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు పార్కింగ్ సదుపాయం కల్పించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి, గొల్లపల్లి ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆలయ కమిటీ చైర్మన్ శాంతయ్య, ఇఓ విక్రమ్, గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పాఠ్యాంశాలకు మించి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

### స్ఫూర్తి విద్యాసంస్థల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం సందర్భంగా స్ఫూర్తి విద్యాసంస్థల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ విద్యా విలువను తెలియజేయాలని ఉద్దేశంతో ప్రతి ఏడాది నవంబర్ 17న అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం నిర్వహిస్తారు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల విజయాల సహకారాన్ని గౌరవించడానికి సంస్కృతిక విభజనలతో అడ్డంకులను తొలగించి బంధాలను పెంపొందించుకునేందుకు ఈ రోజున అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం గా జరుపు కుంటారు అని అన్నారు, మనదేశంలో ఇంటర్నేషనల్ స్కూల్స్, కాలేజీలో, యూనివర్సిటీలో, మల్టీ కల్చర్ స్టూడెంట్స్ సంఖ్య ఎక్కువగా ఉంటుంది దాదాపు ఇందులో చదువుతున్న చాలామంది స్టూడెంట్స్ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి విద్యార్థులతో మంచి స్నేహితులుగా మెలిగేందుకు కూడా ఈరోజు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు



## గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి ఉరి వేస్తున్న మోడీ ప్రభుత్వం

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : కేవైసీ డిజిటలైజేషన్ పేరుతో 27 లక్షల మంది ఉపాధి హామీ కూలీలను తొలగించడం మంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడవటమే కాకుండా ఉరియడమేనని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో చట్టానికి తూట్లు పొడిచి దరఖాస్తు చేసుకున్న ఏ ఒక్కరికి కూడా నూతన జాబు కాడు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వ విధానాన్నే అమలు చేస్తుందని విమర్శించారు. సోమవారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించినారు ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని మోడీ ప్రభుత్వం ఉత్తివేయాలని కుట్రలో భాగంగా ఉపాధి హామీ మౌలిక చట్టానికే కొర్రీలు పెడుతూ కూలీలకు 100 పని పెట్టే బాధ్యతనుండి తప్పుకోవాలని చూస్తున్నదని అన్నారు.అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి నేషనల్ మొబైల్ మోనిటర్ రింగ్ సిస్టం తీసుకొచ్చి ఆధార్ కార్డు, ఉపాధి జాబ్ కార్డు, మండల కేంద్రంలో బ్యాంకు ఎకౌంటు లింకు పేరుతో పేర్లు సరిగా లేవని ఇప్పటికే లక్షల జాబు కార్డులను తొలగించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదునూరి మల్లేష్ , సిపిఎం సీనియర్ నాయకులు గునుగుంట్ల శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు అబ్దుల్లాపురం వెంకటేష్ , శాఖ కార్యదర్శి ఏదునూరి వెంకటేష్ , నాయకులు బొల్లెపల్లి స్వామి, పిట్టల వెంకటేష్, గంగాదరి బాన్ ప్రకాష్ , యండి. రఫీక్ తదితరులు పాల్గొన్నారు





## ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషను ఆధ్వర్యంలో మందులు అందజేత

సంస్థాన్ నారాయణపూర్ నవంబర్ 17( వార్త మిర్రర్) యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని, లచ్చమ్మగూడెంగ్రామానికి చెందిన వరికుప్పల రవి కొన్ని రోజుల క్రితం కాలుకి రక్తం గడ్డ కట్టడం వలన కాలు కొట్టేయడం జరిగిందిఆ విషయం తెలుసుకున్న ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ స్పందించి మందులు అందించారు, చిల్లపురం గ్రామానికి చెందిన కావాలి మధు కొన్ని రోజుల క్రితం నుండి కాండరాల బలహీనతతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ తక్షణమే స్పందించి మందులు అందించారు.ఈ క్రమంలో ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.




## జిల్లాలకూ విజయ పాల ఉత్పత్తులు : చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి

సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 17: రాష్ట్రవ్యాప్తంగా విజయ తెలంగాణ పాల ఉత్పత్తులకు ప్రజలకు చేరవచేసేలా అధికారులు నూతన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కొనుగోలు చేసిన మూడు కొత్త వాహనాలను తెలంగాణ రాష్ట్ర పాల అభివృద్ధి సహకార సంస్థ (విజయ తెలంగాణ డెయిరీ) చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ఎండి.చంద్రశేఖర్ రెడ్డి కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోని దుకాణదారులు డెయిరీ ఉత్పత్తులు నగరానికి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్లేవారని చెప్పారు. ఈ ఇబ్బందులు నివారిస్తూ ప్రజలకు విజయ ఉత్పత్తులను సులువుగా లభించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందులో భాగంగా రీజనల్ సేల్స్ అనే విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా మొదటగా సిద్ధిపేట, వరంగల్, ఆదిలాబాద్ మార్గాల్లో నిర్ణీత రోజుల్లో వాహనాలు పాల ఉత్పత్తులతో తిరుగుతాయని వివరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని మార్గాల్లో పాల ఉత్పత్తులను పంపించేందుకు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. దీనికోసం రీజనల్ డిస్ట్రిబ్యూటర్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు పంపిణీ వ్యవస్థను ఐతం బలోపేతం చేస్తున్నామన్నారు. విజయ పాల ఉత్పత్తుల కోసం 040-27019852, 9121160512 3 సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ ఎండీ చంద్రశేఖర్రెడ్డి, రీజనల్ సేల్స్ డిప్యూటీ డైరెక్టర్ ధన్రాజ్, మార్కెటింగ్ జీఎం శ్రీనివాసరాజు, కామేశ్, క్వాలిటీ చీఫ్ కవిత, పాల సేకరణ జీఎం మధుసూదన్రావు, రమేశ్, సురేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ఉచిత విద్య- మెరుగైన ఉచిత వైద్యం "

**ఒక ఉద్యమం లా సాగాలి...**

## తెలంగాణ యువజన సంఘము సెమినార్ లో ప్రొఫెసర్ కాశీం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 17....ప్రజల ప్రాధమిక హక్కు – ప్రభుత్వల కనీస బాధ్యత అంశం పై ఉస్మానియా యూనివర్సిటీ న్యూ సెమినార్ హాల్ లో జరిగిన సెమినార్ సందర్బంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ ఐదు దశబ్దలా క్రితం పెద్ద బాల శిక్ష చదివిన వాళ్లకి ఉన్నా విద్య లో నైపుణ్యం సాధించిన వాళ్ళ, ప్రస్తుత విద్య వ్యవస్థ లో నైపుణ్యం సాధించటం లేదన్నారు.డిగ్రీ పట్టాలు ఇస్తే సరిపోదని, విద్య లో నైపుణ్యం నేర్పించాలి. ఉన్నత విద్య అభ్యసించిన వాళ్ళు కూడా స్కిల్స్ లేక చిన్న, చిన్న ఉద్యోగాలకు పోటీ పడుతున్నారు. పీజీ లు చదువుతు కానిస్టేబుల్ ఉద్యోగలకోసం పోటీ పడుతున్నారు.కొత్త తరం విద్యార్థులతో పాటు కొత్త విషయాల పై ప్రొఫెసర్ లు కూడా అప్డేట్ కావాలన్నారు.నాణ్యమైన, నైపుణ్య విద్య ను ప్రభుత్వ విద్యాలయల లో, విశ్వ విద్యాలయలలో అందటం లేదన్నారు.ఉన్నత విద్యకి బడ్జెట్ కేటాయింపులు లలో కోతలు పెడుతున్నారని చెప్పారు. ప్రయివేట్ విద్యా వ్యవస్థను నిషేదించక పోతే, ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిలబడలేదు.ఉస్మానియా యూనివర్సిటీ కి 1000కోట్ల బడ్జెట్ కేటాయించి, ఖాళీగా ఉన్నా 800 ఉద్యోగా లు భర్తీ చేస్తే మరోక 30ఏళ్ళు ఉస్మానియా యూనివర్సిటీ ఉన్నత, నైపుణ్య విద్యను అందిస్తుంది అన్నారు.రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ కి ఇచ్చిన రూ. 1000కోట్ల హామీ నెరవేర్చాలని అన్నారు. ఎంవిఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రెడ్డి మాట్లాడుతు పేదల పిల్లలు తరగతి లో చేరిన వారు డిగ్రీ వచ్చే వరకు అనేక కారణలతో చదువుకి దూరం అవుతున్నారని, నాణ్యమైన విద్య అందడం లేదని,విద్యా వ్యవస్థ నిర్లక్ష్యనికి గురి అవుతున్న సమయంలో తెలంగాణ యువజన సంఘము ఆధ్వర్యంలో నాణ్యమైన ఉచితవిద్య- మెరుగైన ఉచిత వైద్యం సెమినార్ నిర్వహించడం అభినందనలు తెలియజేశారు.ఈ సందర్బంగా తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు మాట్లాడుతూదేశం, రాష్ట్రంలో రోజు రోజుకి విద్య – వైద్య రంగాలు తీవ్ర సంక్షోభం లో కూరుకుపోతున్నాయని,తమకి వచ్చే ఆదాయం లో 80 నుండి 90 శాతం విద్యా- వైద్యం కోసం ఖర్చు పెడుతున్నట్లు ప్రపంచ బ్యాంక్ మరియు ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామికల్ కో ఆపరేషన్ అండ్ డెవలప్ మెంట్ సర్వే లెక్కలు తేల్చింది.అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే తల్లి దండ్రులు తమ సంపాదనలో ఎక్కువ భాగం విద్యా, వైద్యానికే ఖర్చు చేస్తున్నట్లు వెల్లడి అయింది.విద్యా రంగంలో "చదువు కొనే" వాళ్ళతో పోల్చితే, సామాన్యుడు పంపించే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ లలో అరకొర వసతులకు తోడు



విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు కూడా లేకపోవడం తో తమ పిల్లల భవిష్యత్తు కోసం ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజు లు చెల్లించి మరీ చదివిస్తున్నారు.అభివృద్ధి చెందిన ఏ దేశాలలో ఈ పరిస్థితి లేదు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, నాణ్యమైన, నైపుణ్యం గల ఉచిత విద్య ను అందించాలని, ప్రతి బడ్జెట్ లో విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ యువజన సంఘము డిమాండ్ చేస్తున్నది.మెరుగైన ఉచిత వైద్యం పై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ...ప్రభుత్వ హాస్పిటల్ లలో వసతులతో కూడిన నాణ్యమైన వైద్యం అందించటం లో సమస్య లు ఉండటం తో,రోగులు తమ ప్రాణాలు దక్కించు కోవడానికి కార్పొరేట్, ప్రయివేట్ హాస్పిటల్స్ కి పోతే ధనార్జనే ద్యేయం గా నడిచే ప్రయివేట్, కార్పొరేట్ హాస్పిటల్స్ రకరకాల టెస్ట్ ల పేరుతో, ట్రీట్మెంట్ ల పేరుతో వేలు, లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్నారు.డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ....ప్రజల నుండి గోళ్లుడ గొట్టి, ప్రతి వస్తువు పై అధిక పన్నులు వసూలు చేస్తూ ప్రతి ఏటా లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెడుతున్న పాలక వర్గాలు ( కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు) ప్రజలకు ప్రాధమిక హక్కులు అయిన నాణ్యమైన విద్య- మెరుగైన వైద్యం అందించాల్సిన కనీస బాధ్యత ఉంది అని అన్నారు.ఈ కార్యక్రమం లో తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులు దాసరి శశాంకర్, రాష్ట్ర కో ఆర్డినేటర్ కర్రే సత్యనారాయణ, తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు యువరాణి, నాయకులు పుల్లూరి రాజు, విప్లవ్ కుమార్, రాజ్ కుమార్, సురేష్ నాయక్, సందీప్, శివ, గోపి, మహేందర్,యడ్ల భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# దీపారాధనతో దైవ సాన్నిధ్యం.. ప్రతి ఒక్కరికీ దక్కాలనే సంకల్పానికి ప్రతిరూపమే కోటి దీపోత్సవం..

## ట్రినిటీ హై స్కూల్ ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 17

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లో ఉన్న ట్రినిటీ హై స్కూల్ లో కార్తీక మాసం చివరి సోమవారం రోజున కోటి దీపోత్సవం కార్యక్రమం ఘనంగా ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రినిటీ హై స్కూల్ ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల పాల్గొని కోటి దీపోత్సవం పూజా నిర్వహించి అనంతరం విద్యార్థుల చేత దీపం వెలిగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ దీపమనగానే గుర్తుకువచ్చే శ్లోకమిది. ప్రమిదలో వెలిగే పరంజ్యోతే పరబ్రహ్మస్వరూపమని శ్లోకార్థం. భగవంతుడిని సాకార నిరాకార రూపాల్లో దర్శించగలిగే ఏకైక సాధనం దీపం. దీపం అంటే ప్రమిదలో నూనె పోసి.. వత్తి వేసి.. అగ్ని వెలిగించడం కాదు. దీపం దైవానికి ప్రతిరూపం.దీపారాధనతో దైవ సాన్నిధ్యం కలుగుతుంది. అందుకే దీపానికి భగవంతునికి అభేదాన్ని చూపేందుకు ప్రతిరోజూ దీపం వెలిగించమన్నారు. మన పెద్దలు. ప్రత్యేకించి కార్తికమాసంలో దీపం వెలిగించడానికి మించిన పుణ్యకార్యం మరొకటి లేదు. అటువంటి పుణ్యఫలితం ప్రతి ఒక్కరికీ దక్కాలనే సంకల్పానికి ప్రతిరూపమే కోటిదీపోత్సవం.కార్తీక మాసానికి ప్రత్యేక స్థానం ఉంది.. హిందువులకు ఈ నెల శివుడు, విష్ణువులిద్దరి పూజ కొరకు చాలా పవిత్రంగా భావిస్తారు.. కార్తీక స్నానాలకు, ఈ మాసం వివిధ వ్రతాలకు శుభప్రదమైనదిగా పురాణాలు చెబుతున్నాయి.కార్తీక మాసంలో సోమవారం రోజున జ్యోతి వెలిగించడం వలన మనసులో చెడు వదిలి మంచి ఉత్తేజం



ఏర్పడుతుంది అని అన్నారు.అలాగే విద్యార్థులచే జ్యోతులు వెలిగించడం వలన విద్యార్థుల మనోవికాసం ఉత్తేజమైందని అన్నారు ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ కృష్ణారావు, ఉపాధ్యాయ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు..

# ప్రజాస్వామ్య పరిరక్షణ సిపిఐ ధ్యేయం

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 17

చౌటుప్పల్ మండల కేంద్రంలో సీపీఐ బస్సు జాతా కరపత్రం ఆవిష్కరణ చేసి ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ ధ్యేయంగా కమ్యూనిస్టు పార్టీ చేసిన త్యాగాలు ,కార్మిక రైతు ఉద్యమాలలో పోరాటాలను ప్రజలకు వివరించేందుకు సామాజిక న్యాయం కోసం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని, సీపీఐ వందేళ్ల ప్రచార బస్సు జాత గద్వాల నుండి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం నాయకత్వం వహిస్తూ ప్రారంభమైన ప్రచార బస్సు జాత ఖమ్మంలో ముగుస్తుందని తెలిపారు.సిపిఐ ఆవిర్భవించి వందేళ్ల ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి బస్సు జాతర నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్, మూసి,కలుషిత జలాలతో పరిశ్రమలతో పరిశ్రమల రసాయనాల కాలుష్య ప్రాంతంగా మారడంతో పుట్టిన శిశువు నుండి అనేక వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలు అనేక గ్రామాలలో ఫ్లోరైడ్ తో జీవచ్ఛవాలుగా బతికి ఉన్న శవాలుగా మారారని అన్నారు. సాగు ,త్రాగు నీరుకై ప్రాజెక్టులు నిర్మించి ఈ ప్రాంతం సస్యశ్యామలం కోసం మూడు దశలుగాసీపీఐ పాదయాత్ర నిర్వహించి అప్పటి ముఖ్యమంత్రి కి కనువిప్పు కలిగేలా పెండింగ్ ప్రాజెక్టు లను పూర్తి చేయాలని ఉద్యమాలు చేపట్టిందని గుర్తు చేశారు. ఈ నెల



19న చౌటుప్పల్ పట్టణానికి విచ్చేస్తున్న బస్సు జాత బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. డిసెంబర్ 26న ఖమ్మం లో జరిగే బహిరంగ సభ ఎంతో అట్టహాసంగా జరగనున్నాయనిఈ సభ లో 45 దేశాల ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. భవిష్యత్తులో వామపక్ష ఐక్యత ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడుత రామలింగం, పిల్లి శంకర్, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, టంగుటూరిరాములు,రండి నరసింహ ,నీళ్ల బిక్షపతి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో ఉచిత బిపి, షుగర్, పరీక్షలు,

## లయన్స్ క్లబ్ ఆఫ్ తిరందాస్ జగన్నాథ్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 17

చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామంలో లయన్స్ క్లబ్ చౌటుప్పల్ సేవా ఆధ్వర్యంలో ఉచిత బిపి ,షుగర్, పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ అధ్యక్షులు తిరందాస్ జగన్నాథ్ మాట్లాడుతూ సమతుల్యం లేని ఆహారం తీసుకోవడం వల్ల పని ఒత్తిడి రిత్య ప్రజలు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆరోగ్యాన్ని పట్టించుకోక చాలామంది పేదలు అనారోగ్యాలకు గురవుతున్నారు కావున లైన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ ఆధ్వర్యంలో చౌటుప్పల్ లో ఉచితంగా బిపి, షుగర్, పరీక్షలు నిర్వహిస్తూ ప్రజలందరినీ ఆరోగ్య సమస్యల నుండి బయటపడడానికి సూచనలు సలహాలు ఇస్తున్నామని అన్నారు. అదేవిధంగా చౌటుప్పల్ మున్సిపాలిటీలోని వలిగొండ రోడ్డులో ఉచిత కంటి ఆసుపత్రి ద్వారా ప్రతి ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ జిల్లా కమిటీ సభ్యులు గోశిక కరుణాకర్, క్లబ్బు కార్యదర్శి ఎం డి అతహర్ పాషా, ఉప్పు ఆంజనేయులు ,బక్క శ్రీనాథ్ చింతల సుదర్శన్ ,చెరుకు రమేష్, చెరుకు అడువయ్య, చెరుకు లక్ష్మమ్మ, నరసింహ, తదితరులు పాల్గొనడం జరిగింది.



# ఇంట్లో నకిలీ నోట్లను ముద్రిస్తూ పట్టుబడితో జైలు శిక్ష ఎన్నేళ్లు..? మీ లైఫ్ ఖతం

భారతదేశంలో నకిలీ కరెన్సీని తయారు చేయడం లేదా ముద్రించడం తీవ్రమైన ఆర్థిక నేరంగా, జాతీయ భద్రతా నేరంగా పరిగణిస్తారు. అందువల్ల నకిలీ కరెన్సీకి శిక్ష చాలా కఠినమైనది. %జతీజ% సెక్షన్ 178 ప్రకారం.. నకిలీ కరెన్సీని ముద్రించడం..భోపాల్‌లో నకిలీ కరెన్సీకి సంబంధించి ఇటీవల ఒక పెద్ద విషయం బయటపడింది. నెలల తరబడి తన అద్దె గదిలో నకిలీ కరెన్సీని ముద్రిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. భోపాల్ పోలీసుల ప్రకారం.. పదవ తరగతి గ్రాడ్యుయేట్ అయిన వివేక్ యాదవ్ భోపాల్‌లోని తన అద్దె గదిలో నకిలీ కరెన్సీని ముద్రిస్తున్నాడు. ఉత్తరప్రదేశ్ నివాసి అయిన యాదవ్ ఇంట్లో నకిలీ కరెన్సీ కోసం పూర్తి సెటప్‌ను రూపొందించడానికి ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసిన తన అనుభవాన్ని ఉపయోగించుకున్నాడు . పోలీసులు 428 నకిలీ 500 రూపాయల నోట్లు, ఒక కంప్యూటర్, ప్రింటర్, స్కానర్, దాదాపు 3 మిలియన్ల రూపాయల విలువైన నకిలీ నోట్లను ముద్రించడానికి ఉపయోగించే ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా ఇంట్లో నకిలీ నోట్లను ముద్రించడానికి ప్రయత్నిస్తే వారు ఎదుర్కొనే శిక్ష గురించి తెలుసుకుందాం.

### ఉమ్రా యాత్రికులు మరణించడం పట్ల

## తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాము... డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి



సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 17: సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ విద్యానగర్‌కు చెందిన 18 మంది ఉమ్రా యాత్రికులు దుర్మరణం చెందిన విషాద ఘటనపై గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.దుర్ఘటన విషయం తెలిసిన వెంటనే డిప్యూటీ మేయర్ మృతుల కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడి వారి ఆవేదనను అర్థం చేసుకొని పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వం బాధిత కుటుంబాల పక్షాన నిలిచి అవసరమైన అన్ని రకాల సహాయం అందిస్తుందని భరోసా ఇచ్చారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ"ఈ విషాద సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అలాగే సౌదీ అరేబియాలో ఉన్న అధికారులతో సమన్వయం చేసేందుకు ప్రత్యేక అధికార ప్రతినిధులను పంపింది. కేంద్రం, సౌదీ ప్రభుత్వాలతో సమన్వయం చేస్తూ మృతుల పార్థివ దేహాలను తొందరగా స్వదేశానికి రప్పించేందుకు ప్రత్యేక చర్యలు వేగవంతం చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని విధాల సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సౌదీ ప్రమాదంలో విద్యానగర్ వాసుల మరణం నగరాన్ని విషాదంలో ముంచేసిందని డిప్యూటీ మేయర్ పేర్కొంటూ, బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# మనుషులు ఎప్పుడూ భయపడుతూ బ్రతుకుతుంటారు ఎందుకు?

### భయం లేని జీవితం వుందా?

### భయాన్ని జయించటం ఎలా ?



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 17భయకృత్, భయనాశనః " అనే అద్భుత నామాలు ఉన్నాయి విష్ణుసహస్రనామ స్తోత్రంలో – అంటే భయాన్ని కలిగించేదీ ఆయనే భయాన్ని నాశనం చేసేదీ ఆయనే అని. అదెలాగా, భగవంతుడు మన భయాన్ని పోగొట్టాలి కాని కలిగించడం ఏమిటీ అన్నది ఒక మంచి ప్రశ్నే.భగవంతుడు ఇలా చేసేది భక్తుల విషయంలోనే త్రిగుణాల ప్రభావం వల్ల భక్తుల మనస్సు చెడుపనుల వైపు మరలుతే భయం కలిగిస్తారు. అధర్మం జరుగుతూన్నప్పుడు ఎదిరించడానికి భయం తొలగించి ధైర్యం కలిగిస్తారు. భయం అనేది ఒక వరం, అది లేకపోతే ఎన్నో అనర్థాలు జరుగుతాయి. ఒకాయన ఇంకో ఆయనతో గొడవపడతాడు, అవతలి వాణ్ణి హత్యచేసేద్దామన్నంత కోపం వచ్చేస్తుంది. హత్య చేయడానికి కావలిసిన బలం, డబ్బు, బలగం అన్నీ ఉంటాయి. వీటితోపాటు అతని అదృష్టం కొద్దీ భక్తుడు కనుక కొద్దిగా భయం కూడా ఉంటుంది. ఏమనీ అంటే ఎంత జాగ్రత్తగా హత్య చేసినా ఎలాగైనా పోలీసులు పట్టేస్తారు. కోర్టు ఉరిశిక్షో యావజ్జీవమో వేస్తుంది, ఇంత బ్రతుకు బ్రతికి అలాంటి శిక్ష తనకీ తన కుటుంబానికీ ఎంత అవమానకరం అని ఓ క్షణం భయపడతాడు. కోపం నుంచి బయటపడతాడు. మళ్ళీ ఆనందమయమైన జీవితం గడుపుతాడు. ఎక్కువ మందిలో భగవంతుడు కలుగచేసిన భయం ఉంటుంది. దానివల్ల కష్టాలనుంచి తప్పించుకుంటారు. కొద్దిమంది మాత్రమే ఈ భయాన్ని పట్టించుకోక తప్పులు చేసి శిక్షలు అనుభవిస్తారు. ఈ అవినీతికి కూడా మూలం భయం లేకపోవడం. అంటే భక్తి లేకపోవడం. చిన్నప్పటి నుంచి పిల్లలకు బడులలో రామాయణ, భారత, భాగవతాలు చెప్పడం మొదలుపెడితే వారిలో భక్తి కలుగుతుంది. చెడుపనులు చేయాలంటే భయం కలుగుతుంది. చెడుపనులకు దూరంగా ఉంటారు. అతి సర్వత్ర వర్జయేత్ అన్నారు. భయమైనా ధైర్యమయినా అతి పనికిరాదు. శుభమస్తు తిరుమల శంకర్

# గొర్రెల మేకలకు వెంటనే నట్టల మందుల పంపిణీ చేయాలి.!

## కురుమ యువ చైతన్య జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ డిమాండ్



యాదాద్రి భువనగిరి జిల్లాలో గొర్రెల మేకలకు వెంటనే నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు కురుమ యువ చైతన్య జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాలుగా నటల నివారణ మందులు పంపిణీ చేయకపోవడంతో, గొర్రెలు నాణ్యత తగ్గి, కాపరులు నష్టపోతున్నారని అన్నారు. కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలకు నష్టపరిహారం ఇవ్వాలి. కుక్కల నివారణ చర్యలు చేపట్టాలి. గొర్రెలకు, మేకలకు ఉచిత భీమా సౌకర్యం కల్పించాలి. గొర్రెల కాపరులకు పది లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. యాదాద్రి భువనగిరి జిల్లాలో గొర్రెల దొంగతనాలను అరికట్టాలి. 50 సంవత్సరాలు దాటిన కాపర్లకు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



# ఇందిరమ్మ ఇండ్లను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ వెంకట్రాంరెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 17 : చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో నూతనంగా నిర్మాణం చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాం రెడ్డి తదనంతరం మాట్లాడుతూ మున్సిపాలిటీలోని మొత్తం 300 కు గాను వివిధ నిర్మాణ దశల్లో ,రూఫ్ లెవెల్100 ఇండ్లు, లెంటల్ లెవల్లో 160 ఇండ్లు, మరియు నిర్మాణం పూర్తయిన ఇండ్లు మూడింటిలో రెండింటిని ఆవుల మమత, చిన్న కొండూరు రోడ్ హనుమాన్ టెంపుల్ పక్కన నిర్మించుకున్న ఇంటిని శ్యామల అన్నపూర్ణ శివాజీ నగర్, బక్క సత్తమ్మ మున్సిపల్ కార్మికురాలు ఇండ్ల నిర్మాణాలను) పర్యవేక్షించడం అయినది.ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ రామ్, నారాయణమూర్తి,బిల్ కలెక్టర్ భాస్కర్, సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ సునీల్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.